ప్రైవేటు యాజమాన్యాలు పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయాలి



విశాలాంధ్ర-కంభం : ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభించే నాటికి మండలంలోని అన్ని ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థుల వద్ద పాఠ్య పుస్తకాలు ఉండాలని మండల విద్యాశాఖాధికారి బి.మాల్యాద్రి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలల నిర్వాహకులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలకు అవసరమైన ఇండెంట్ నమోదు చేసి 5శాతం నగదు జమ చేయాలని తెలిపారు. ఈ ప్రిక్రియను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు. అనంతరం పాఠశాలల గుర్తింపు మరియు పునరుద్ధరణ వార్షిక రుసుము తదితర అంశాలపై చర్చించారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండలంలో ఎక్కువ యాక్సిడెంట్లు జరుగుతున్న సందర్భంగా వాహనదారులకు మంగళవారం హనుమంతుని పాడు మండల ఎస్సై.జి.కృష్ణ పావని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోలలో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అలానే బైకుల మీద వెళ్లే వారికి ట్రాఫిక్ రూల్స్ అన్ని పాటిస్తూ హెల్మెట్ ధరించి నిబంధనలను పాటించాలని హెచ్చరించారు. అలానే యువత క్రికెట్ బెట్టింగ్ మరియు పేకాట లాంటివి సరదాలకు బానిసై మహిళ మెడలలో బంగారు ఆభరణాలు తీసుక వెళ్లడం ర్యాగింగ్ లాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. అలానే గ్రామాలలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాత్రి సమయాలలో ఆరుబయట మేడపైన నిద్రించేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రజలకు ఎస్సై తెలియజేశారు.

ఐదేళ్లు నిండిన బాలబాలికలను పాఠశాలలో చేర్పించాలి

విశాలాంధ్ర-పెద్దారవీడు : నూతన విద్యా సంవత్సరం ఈ నెల 12వ తేదీన ప్రారంభమవుతున్న సందర్భంగా మండలంలోని దేవరాజు గట్టు గ్రామంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.వి.సిహెచ్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెద్దారవీడు మండల విద్యాశాఖ అధికారి పి.శ్రీనివాసులు పాల్గొని, మాట్లాడుతూ విద్యార్థుల కొరకు ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి మొదలైన ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.5 సంవత్సరాలు నిండిన బాల బాలికల ఇండ్లను సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఎంపీపీఎస్ దేవరాజు గట్టు పాఠశాలలో అడ్మిషన్ చేయటం జరిగింది. ఐదు సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో ఖచ్చితంగా చేరాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరాజు గట్టు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి కృష్ణారెడ్డి, గొబ్బురు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు, బి.శ్రీరాములు, దేవరాజు గట్టు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్ పిలు, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : చేపలు పట్టే ప్రతి ఒక్క మత్స్యకారుడు ఫిష్ ఆంధ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా పయనించాలని వైకెపి ఎపిఎం ఎం.హనుమంతరావు అన్నారు. స్థానిక వైకెపి కార్యాలయంలో మంగళవారం ఎస్సీ ఎస్టీ మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ మత్స్యకారుల అభివృద్ధి కొరకు వారి జీవనాభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు పెట్టి వారిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీ రైతులు వైకెపి పథకం ద్వారా స్త్రీ నిధి, ఉన్నతి, పథకాల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దళిత బహుజన రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీ మత్స్యకారులను గుర్తించి వారిని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. చేపలు పట్టే ప్రతి ఒక్కరికి లైసెన్స్ ఇవ్వడంతో పాటు మత్స్యకారులు గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ గోపన బోయిన వెంకటరావు, ఆర్ తేజస్విని, వెలుగు సీసీలు పి గురవయ్య, డేవిడ్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వేరే ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి



విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామీణ ప్రాంతాల్లోనే గృహవాసులు వేరే ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి వివరాలు పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ ఎల్ సంపత్ కుమార్ కోరారు. మండలంలోని పోలవరం, నాయుడుపాలెం గ్రామాలలో మంగళవారం జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ ఆదేశాల మేరకు దొంగతనాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువ జరిగే అవకాశం ఉన్నందున గృహ వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వేరే గ్రామాలకు వెళ్లే సమయంలో తమ ఇంటి వివరాలతో పాటు, బంగారం ఆభరణాలు, నగదు బ్యాంకులో పెట్టుకొని వెళ్లాలన్నారు. మీ ఇంటి సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తే పోలీసు వారు మీ ఇంటికి ఒక అలారం ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఎవరైనా ఇంటి తాళాలను గూట్లో గాని, కిటికీలో గాని, పెట్టకుండా మీ వెంట తీసుకువెళ్లాలన్నారు. గ్రామాల్లో వాలంటీర్లు మహిళా సంరక్షణ కార్యదర్శులు గ్రామస్తులతో సంయుక్తంగా రాత్రి గస్తీ తిరగాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం చేరవేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అంకమ్మరావు, సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి శ్రీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలం నాయుడుపాలెం పంచాయితీలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులను మండల ఏపీవో ఏలీషా, ఈసీ రమేష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరు ఉదయాన్నే ఆరు గంటలకు పని ప్రదేశానికి వెళ్లి తొమ్మిది గంటల వరకు పని చేయాలన్నారు. అర్హత ఉండి జాబ్ కార్డ్ లేని వాళ్ళు కొత్తగా పెళ్లి అయి రేషన్ కార్డ్ ఉన్న వాళ్ళు కొత్తగా జాబ్ కార్డు పెట్టుకుంటే వారికి కూడా జాబ్ కార్డు చేసి పనులు కల్పిస్తామని తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. వారితో పాటు టెక్నికల్ అసిస్టెంట్ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌రెడ్డి, ఉన్నారు.

రోజుకో వివాదం

- రానున్న ఎన్నికలలో సీటు సాధించటమే లక్ష్యంగా వైసీపీ నేతల దాడులు
- నిత్యం వివాదాలలో ఉండటమే లక్ష్యం
- అధికార పార్టీకి దాసోహమంటున్న జిల్లా పోలీస్ యంత్రాంగం
- జిల్లాలో రోజురోజుకు వేడెక్కుతున్న రాజకీయం

సోమవారం ఘటనలో పోలీసులు చింపిన చొక్కాతో ఎమ్మెల్యే స్వామి

చంద్రబాబు పర్యటనలో చొక్కా విప్పి నిరసన తెలుపుతున్న మంత్రి సురేష్

విశాలాంధ్ర-ఒంగోలు : 2024 సార్వత్రిక ఎన్నికలలో సీటు సాధించటమే లక్ష్యంగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లు బరితెగించి వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికలలో తమకు సీటు రాదేమోననే అనుమానంతో ఎప్పుడూ తాము వార్తలలో ఉండటమే లక్ష్యంగా వివాదాలకు కేంద్రబింధువులుగా మారి ఆందరి దృష్టి పడేలా అందునా అధిష్టానం దగ్గరకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇటీవల కాలంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు చేపడుతున్న కార్యక్రమాలను చూసి, వారి చేష్టాలను చూసి ప్రజలు నవ్వుకుంటుండగా, నవ్విపోదురుగాక నాకేమి నాకు కావాల్సింది ఎమ్మెల్యే సీటు మాత్రమే అన్న తీరుగా వ్యవహరిస్తున్నారు.

'పరికూటి' వ్యవహార శైలీ

ఒక ఎమ్మెల్యేపై అవినీతి ఆరోపణలు ఉంటే వాటిని అసెంబ్లీలో నిలదీసే హక్కు అధికార పార్టీకి ఉంటుంది. దానిని గాలికి వదిలి కొండపి నియోజక వర్గంలోని వైసీపీ కార్యకర్తలందరినీ కూడేసి టిడిపి దళిత ఎమ్మెల్యే స్వామి గ్రామంలోకి ర్యాలీలు నిర్వహించి రెచ్చగొట్టటం ఎంత వరకు సబబు.అంతే కాదు పోలీసుల చేత అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే చొక్కా చించేలా నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేయటం ఎంత వరకు సబబు, జిఓ నంబర్ 1 పేరుతో ఎటువంటి ర్యాలీలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని చెప్పే అధికార పార్టీకి ఇవి కనిపించకపోవటం దారుణం. అయితే పరికూటి అశోక్ బాబు ప్రస్తుతం కొండపి నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. గతంలో ఈయన కొండపి ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు.కొన్ని పర్యాయాలు అలకపూనారు. తమ పార్టీ వర్గాలు సృష్టించేందుకు ప్రయత్నించారు. ఇన్ని చేసిన తనకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వకపోవటంతో వచ్చే ఎన్నికలలో ఎలాగైన టిక్కెట్టు దక్కించుకోవాలనే లక్ష్యంతో వైసీపీ రాచమార్గాన్ని ఎన్నుకున్నారు. ఎప్పుడు వార్తలలో ఉండేలా సొంత కార్యక్రమాలు నిర్వహించటం, ఎల్లప్పుడు వివాదాలు రేకెత్తేలా వ్యవహరించటం వంటి కార్యక్రమాలకు పూనుకున్నారు. వెరసి నేడు దళిత జాతికి చెందిన ఒక మహిళ మరణానికి కారకులయ్యారు. ఎటువంటి కక్ష్యా కార్పణ్యాలు లేని దళితుల ఇంట చిచ్చుపెట్టి ఒక కుటుం బానికి తీరని అన్యాయం చేయటానికి కారణభూతుడయ్యారు.

ఎమ్మెల్యే బాలినేని

అంతకు ముందే మంత్రి సురేష్

నిత్యం సౌమ్యుడుగా ఉండే రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ లో కూడా ఇటీవల కాలంలో అసహనం పెరిగిపోయింది. గతంలో సరిగా పనిచేయని ప్రజాప్రతినిధుల జాబితాలో సురేష్ పేరు ఉండటంతో వచ్చే ఎన్నికలలో తాను ఎమ్మెల్యే సీటు ఎలాగైనా సంపాదించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగానే యర్రగొండపాలెంలో యాత్ర చేస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కార్యక్రమానికి మంత్రి స్థాయిలో ఉండి నిరసన తెలపటమే కాకుండా చంద్రబాబుపై రాళ్ల దాడికి కారణభూతుడయ్యారు. మంత్రి స్థాయిలో ఉండి చొక్కా విప్పి సామాన్య ప్రజానికం సిగ్గుపడేలా ప్రవర్తించటమే కాకుండా తన కార్యకర్తల ద్వారా చొక్కాను టిడిపి నాయకులు చించి వేశారంటూ అసత్య ప్రచారం చేయించుకోవటం చూసి ప్రజలు నివ్వెరపోయేలా చేశారు. ఏదో విధంగా తాను కూడా రాష్ట్ర స్థాయిలో వివాదాల మంత్రిగా పేరుగడించేందుకు ప్రయత్నించారు.

బాలినేని ది అదేబాట

రెండవ సారి మంత్రి వర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి దక్కని నాటి నుండి బాలినేని శ్రీనివాసులరెడ్డి తన పంథాను మార్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన బలం నిరూపించుకునేలా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూనే ఉన్నారు. అందులో భాగంగా తనకు మంత్రి పదవి పోయిన సమయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులందరి చేతరాజీనామాలు చేయించారు. తనకు మూడు జిల్లాలో కోఆర్డినేటర్ పదవి దక్కే వరకు తన నిరసనను తెలిపారు. ముఖ్యమంత్రి జరిపిన సర్వేలో భాగంగా ఒంగోలులో బాలినేని పనితీరు బాగోలదని తేల్చటంతో తనకు వచ్చే ఎన్నికలలో ఎక్కడ ఎమ్మెల్యే సీటు దక్కదో అని నిరసన గళాన్ని మరింత గట్టిగా వినిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. జగన్ యర్రగొండ పాలెం టూర్‌లో తనకు అవమానం జరిగిందని కార్యక్రమం నుండి వెనుతిరిగారు. ముఖ్యమంత్రి పేషీ నుండి డైరెక్టుగా ఫోన్ చేయించుకున్న తర్వాత కాని తాను తిరిగి సభలో పాల్గొనలేదు. అంతే కాకుండా ఆ తర్వాత కాలంలో మూడు జిల్లాల కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేయటమే కాకుండా ముఖ్యమంత్రి కూడా గట్టిగా రాజీనామానాను వెనక్కి తీసుకోమని చెప్పకపోవటంతో మరింతగా మానసికంగా ఇబ్బందికి బాలినేని గురయ్యారు. ఈ క్రమంలోనే పార్టీలో తిరిగి పూర్వవైభాన్ని సంపాదించుకునేందుకు వివాదాస్పద ఫ్లక్సీలు వేసి తిరిగి వార్తలలో ముఖ్యభూమిక పోషించారు. ఒంగోలులో వివాదాలకు కేంద్ర బిందువచ్చారు. జనసేన పార్టీ వేసిన ఫ్లక్సీలు తొలగించి, వైసీపీ ఫ్లక్సీలు తొలగించటక పోవటంతో పోలీసులు తమస్వామి భక్తిని చాటుకున్నారు. ఈ విధంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఏదో విధంగా వివాదాలకు కేంద్ర బిందువులుగా మారాలని చూస్తూ ప్రజల మనస్సులో ఎంత చులకన అవుతున్నారో మరుస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి

జిల్లా సెక్రెటరీ డీకే ఎం.రఫీ డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ ఇంజ నీరింగ్, పారిశుద్ధ కార్మికుల్ని వెంటనే రెగ్యులర్ చేయాలని ధర్నా నిర్వహించడం జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి డికేఎం రఫీ మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం వారి చేత చాకిరి చేయించు కుంటుందని, మాటలతో కాలక్షేపం చేస్తుందని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా,పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. తాజాగా ప్రకటించిన రెగ్యులరేషన్ జాబితాలో మున్సిపల్ కార్మికుల్ని, ఆప్కాస్ పరిధి లోని కార్మికుల్ని చేర్చక పోవటం దారుణమని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్సులు స్కిల్డ్, సెమి స్కిల్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కే సుబ్బరాయుడు, కార్యదర్శి జి హరి, ఎస్ కే ఇమాంసా, జిపి తిరుమలయ్య, పి.సలాం ఖాన్, పి.శ్రీను, రమణ, పిఏ బ్రహ్మం, కనకయ్య, చెన్నకేశవులు, గురునాథం, నాసరయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్ద దోర్నాల పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో తనిఖీ చేసిన ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్. ఈ నేపథ్యంలో పెద్ద దోర్నాల విచ్చేసిన ఎస్పీ మల్లిక గర్గ్‌కు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం చేసి, ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో ఎస్పీ మల్లిక గర్గ్ స్టేషన్లోని పలు రికార్డులను పరిశీలించి కేసుల పురోగతి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు. ఎస్పీ మల్లిక గర్గ్ పోలీస్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ మారుతి కృష్ణ, పెద్ద దోర్నాల ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

'కందుల'ను పరామర్శించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర-మార్కాపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిని మంగళవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు మర్యాద పూర్వకంగా కలసి పరామర్శించారు. కందులను కలసి వారిలో బాపట్ల పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు, అద్దంకి శాసనసభ్యులు, గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు, బనగానపల్లె మాజీ శాసన సభ్యులు బీసీ జనార్దన్‌రెడ్డి, గిద్దలూరు మాజీ శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, సంతనూతలపాడు మాజీ శాసన సభ్యులు బిఎన్ విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి దామచర్ల సత్య తదితరులు వున్నారు. వారు త్వరగా కొలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

పురుగుల మందులు కొంటే బిల్లులు కచ్చితంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండల వ్యవసాయ అధికారి టూర్ డైరీలో భాగంగా మండలంలోని దేవరాజుగట్టు రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి కే.బుజ్జి బాయ్ మంగళవారం సందర్శించడం జరిగింది. అనంతరం ఆర్బికే పరిధిలోని శివాపురం గ్రామానికి వీక్షించి అక్కడి రైతులతో మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి పంటలు ఏఏ రకాలు వేస్తారని తెలుసుకొని రైతులు నకిలీ విత్తనాలు పురుగు మందులు పట్ల జాగ్రత్త పడాలని విత్తనాలు, పురుగు మందులు కొన్నప్పుడు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. బయట ఊర్లో నుంచి వచ్చి విత్తనాలు పురుగు మందులు ఎవరైనా అమ్మితే అగ్రికల్చర్ ఆఫీసర్‌కి సమాచారం తెలపాలని ఆ విధంగా చేసినట్లయితేనే నకిలీ విత్తనాలు, పురుగు మందులను నివారించగలుగుతామని రైతులను తెలిపారు. రైతులు మందుల,విత్తనాల షాపు దగ్గర నుంచి ఎటువంటి మందులు విత్తనాలు కొన్నా కూడా బిల్లు తప్పనిసరిగా ఉండాలని, నకిలీ విత్తనాలు అమ్మిన వాళ్లపై చర్యలు తీసుకోగలుగుతామని బిల్లు లేకుండా ఎటువంటి చర్యలు తీసుకోలేమని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఎస్ ఏ చిన్నగ్రామ రైతులు పాల్గొన్నారు.

పందులను అరికట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడండి

ఎంపీజే డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టీస్ మార్కాపురం పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో పందుల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ దృష్టికి వినతిపత్రం రూపంలో ఇవ్వడం జరిగింది. ముందుగా ఛైర్మన్ ఛాంబర్ ముందు యంపిజే ఆధ్వర్యంలో నానజాతి కాలనీ వాసులు నిరసన తెలపడం జరిగింది. అందుకు స్పందించిన చైర్మన్ శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్‌ని పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. యంపిజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ కే. అబ్దుల్ రజాక్ (బాబు) మాట్లాడుతూ పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న పందుల సమస్యతో ప్రజలు అనారోగ్యం పాలౌతున్నప్పటికి పాలకులు ఎటువంటి శాశ్వతమైన చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కావున కుక్కలు, పందులు, ఆవులను ఇప్పటికయిన దూర ప్రాంతాలకు తరలించాలని కోరారు. డబ్బులు తీసుకుని పందులను పట్టించుకోకుండా వదిలేస్తున్నారని మహిళ పేర్కొనగా చైర్మన్ చిర్లంచర్ల బాల మురలి కృష్ణ ఆమె మాటలను ఖండించారు. ఈ కార్యక్రమంలో యంపిజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాశిం, పట్టణ అధ్యక్షులు షేక్ అమీర్, యంపిజే నాయకులు నాగూర్ మీరావలి, షేక్ ఖాశింసా, మెహబూబ్, రసూల్, సుబ్బయ్య, అబ్బాస్, జబ్బార్, స్థానిక మహిళలు అంజలి, సుబ్బమ్మ, రసూల్ బీ, ఖాశింబీ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతో మేలు

విశాలాంధ్ర-చీమకుర్తి : స్థానిక శాఖాగ్రంథాలయంలో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు కథలు చదివి చెప్పడం జరిగింది. విద్యార్థులలో సామాజిక చైతన్యం కోసం నాటకాల పై ఉపాధ్యాయులు నారాయణ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉపాధ్యాయులు నరేంద్ర కమార్ నృత్యం, కోలాటం, పాటలు పాడడం, పద్యాలు చెప్పడంపై శిక్షణ ఇస్తున్నారు.మరొక ఉపాధ్యాయులు ప్రతాప్ కుమార్ కథలు చెప్పడం పై శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం గ్రంథాలయంలో డ్రాయింగ్ మరియు పాటలు పాడటం పై పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రతి రోజు ఒంగోలు గేలాక్సీ గ్రానైట్ అధినేత చలువాది బదరీ నారాయణ మజ్జిగ ప్యాకెట్లు అందించడం జరుగుతుంది. పాటలపోటీలలో గెలిచిన విద్యార్థులకు ఈనెల 11వ తేదీన జరుగు ముగింపు వేడుకలలో లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి వారి ఆధ్వర్యంలో బహుమతులు అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్య క్రమంలో 47మంది విద్యార్థిని విద్యార్థులు గ్రంథపాలకుడు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సిగ్నల్ టవర్ ఎక్కిన ఎమ్మార్పీఎస్ నాయకుడు

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజ్ సిగ్నల్ టవర్ ఎక్కి నిరసనకు దిగాడు. ఇటీవల కందులాపురం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన జగ్జీవన్ రావ్ విగ్రహాన్ని తొలగించడం పై ఆగ్రహం వ్యక్తం చేశాడు.తక్షణమే తొలగించిన విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిగ్నల్ టవర్ పై నిరసన దిగాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఎమ్మార్పీఎస్ నాయకులతో రెవెన్యూ.పోలీసు అధికారులు మాట్లాడి సమస్య పరిష్కరించే దిశగా. రేపు ఉదయము రెవెన్యూ అధికారులు. పోలీస్ అధికారులు అంబేద్కర్ విగ్రహానికి స్థలం ఎంత కేటాయించారని. కొలతలు వేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నిరసనకారుడు నిరసన విరమించుకొని సిగ్నల్ టవర్ పైనుంచి కిందికి దిగాడు. ఈ కార క్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పానుగంటి సాలెం రాజ్,పీపుల్స్ యాక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి విజయ్ కుమార్, బహుజన పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు దాసరియోబు, మార్కాపూర్ డివిజన్ నాయకులు వేష పోగు రమేష్,ఎమ్మార్పీఎస్ నాయకులు భూదాల ఆనంద్, మండల నాయకుడు మనోజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలలపై డీఈఓ దృష్టి సాధించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లాలో ఎయిడెడ్ సంస్థలు, ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సిహెచ్ ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా పాఠశాలలు ఒకే టీచర్‌తో బోధన జరుగుచున్నదన్నారు. చాలా పాఠశాలలకు రికగ్నేషన్ లేని కారణంగా ఉపాధ్యాయులపై భారం పడుతుందని, వసతులు లేని విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారి ముగ్గురు సభ్యుల కమిటీ రిపోర్ట్ అమలు చేయాలన్నారు.

టీడీపీ మండల కార్యదర్శిగా గోనా ప్రతాప్

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం పార్టీ వెలిగండ్ల మండలం ప్రధాన కార్యదర్శిగా గోన ప్రతాప్ నియమితులయ్యారు. మంగళవారం కనిగిరిలోని తెలుగుదేశం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా గుడిపాటిపల్లి గ్రామానికి చెందిన సుదీర్ఘకాలంగా పార్టీలో ఉంటూ కార్యకర్తగా అనేక పదవులను చేపట్టి ప్రజలకు సేవలు అందించడంలో ఆయన చేసిన కృషిని గుర్తుగా మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం ఇన్చార్జి ఉగ్ర నరసింహారెడ్డి మండల తెలుగుదేశం నాయకులు సహకారంతో ఆయనకు ఈ పదవి దక్కింది. గోనా ప్రతాప్ మాట్లాడుతూ పార్టీ ఇంచార్జ్ ఉగ్ర అన్న ఇచ్చిన పనిని పూర్తి చేయడంలో నిష్ట గరుష్టుడమై ఉంటారన్నారు.

దావా సమను
మహారాజశ్రీ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో
అండర్ ఆర్డర్ 5 రూల్స్ 5 ప్రకారం
O.S. No. 95 /2012

గొల్లా లక్ష్మీసుప్రజ -వాది
వర్సెస్
యర్రగుండు ఆదిరెడ్డి - ప్రతివాది

To
యర్రగుండు ఆదిరెడ్డి సన్నాఫ్ కోటయ్య R/o వైయస్సార్ రోడ్డు కనిగిరి గ్రామం & మండలం ప్రకాశం జిల్లా వారికి

పై నెంబరు దావా పరిహారము పొందకోరి వాది నీ పైన దావా దాఖలు చేసి యున్నాడు. గనుక నీవు **తేదీ 19-06-2023 న పగలు 10.30 నిమిషములకు పై కోర్టు నందు హాజరై నీవు స్వయంగా,** గానీ లేదా మీ తరపు ప్లీడర్ ద్వారా గానీ హాజరై నీ వ్యాజ్యము తెలియపర చవలెను లేని ఎడల శ్రీకోర్టు మిమ్మల్ని పిలిచి మీకు వరోక్షము తీర్మానించబడునని తెలుసుకొనవలెను.

వాయిదా తేది : 19-06-2023
// బై కోర్టు ఆర్డర్//

జె.ఎస్.బాబురావు బి.ఎ, బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్,
కనిగిరి, ప్రకాశం జిల్లా.

డాక్యుమెంట్స్ పోయినవి

నా పేరు మీద కలిగియున్న మార్కాపురం మున్సిపాలిటీ యిలాఖాలోని సర్వేనెంబరు 436 లోని స్థిరాస్తి విక్రయదస్తావేజు ద్వారా **డాక్యుమెంట్ నెం79/ 2022,** మరియు సేల్ ఆఫ్ డీడ్ **డాక్యుమెంట్ నెం 1201/2023** నెంబరు ద్వారా కలిగిన రెండు ఒరిజినల్ డాక్యుమెంట్లు మార్కాపురం నుండి ఒంగోలుకు వెళుతుండగా మార్కాపురం ఆర్టీసి బస్టాండు వద్ద నా బ్యాగులో పోయినవి. అంతట చుట్టు ప్రక్కల వెతికినా కనిపించలేదు. అందు నిమిత్తము నేను మార్కాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో తేది **31-05-2023**న ఫిర్యాదు చేసినాను. కావున నా యొక్క ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లు దొరికిన యెడల క్రింద తెలిపిన నా యొక్క అడ్రసు తెలుపగలరు.

సాదన గురయ్య తండ్రి చిన్నగురయ్య,
వయస్సు 45 నల్లాయపల్లి గ్రామం,
మామిళ్లపల్లి పోస్టు, కలసపాడు మండలం,
కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్ : 8395801036

గ్రామ పంచాయితీ - కొత్తపట్నం, ప్రకాశం జిల్లా

ఆర్ఓసి నెం:8/2023 **టెండర్ ప్రకటన** తేదీ:27-05-2023

ప్రకాశం జిల్లా,కొత్తపట్నం మండలం, కొత్తపట్నం గ్రామ పంచాయితీ నందు **తేదీ:1/07/2023 నుండి 30-06-2024** వరకు ఒక సంవత్సరమునకు ఈ దిగువ పనులకు నెలవారీ కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు **తేదీ:9-06-2023న ఉదయం 11 గంటలకు** సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. మరియు ఆదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. ఆసక్తిగల వారు టెండరు దరఖాస్తును రూ.500 రసీదును టెండరు షెడ్యూల్‌కు జతపరచవలెను. ఏ కారణము చూపకనే టెండర్లు రద్దు చేయుటకు మరియు వాయిదా వేయుటకు గ్రామ పంచాయితీకి పూర్తి అధికారము కలదు.

సీరియల్ నెం.	పనివివరములు	కాలము	ధరావత్తు
1.	స్వీపర్లు-9	1/07/2023 టు 30/06/2024	రూ.500
2.	టర్న్‌కాక్-2		
3.	ఇంజన్ డ్రైవర్-2		
4.	ట్రాక్టర్ డ్రైవర్-1		
5.	ఎలక్ట్రీషియన్-1		
	మొత్తం -15		

నిబంధనలు: **1.**కాంట్రాక్టు ఒక సంవత్సరం కాలం వరకు **1-07-2023 నుండి 30-06-2024** వరకు అమలులో వుంటుంది. **2.** గ్రామ పంచాయితీ నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమే వేతనం చెల్లించబడును. **3.** కాంట్రాక్టు రద్దు చేయుటకు గ్రామ పంచాయితికి అధికారము కలదు. **4.** కాంట్రాక్టు పని సంతృప్తిగా లేని ఎడల అతని స్థానంలో వేరొకరిని నియమించు అధికారము గ్రామ పంచాయితి వారికి కలదు.

గ్రామ పంచాయితి కార్యదర్శి, కొత్తపట్నం

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో భూసేకరణ ప్రక్రియ, రెవెన్యూ అంశాలపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో తీసుకున్న చర్యలపై తనకు నివేదికను పంపించాలని దిశా నిర్దేశం చేశారు. "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి రోజూ జె.కె.సి. సైట్ ఓపెన్ చేసి ఉదయం, సాయంత్రం వచ్చిన అర్జీలను కచ్చితంగా స్వీకరించాలని ఆయన అన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రతి రోజూ కనీసం 30 ఎకరాలు రీ సర్వే చేయాలన్నారు. చుక్కల భూములకు సంబంధించి రైతులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన పత్రాల పంపిణీ రెండు రోజులలో పూర్తి చేయాలన్నారు. సాదాబైనామా కేసుల పరిష్కారంలో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. భూసేకరణ ప్రక్రియలో పెండింగ్ క్లెయిమ్లను త్వరగా పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ ఐ.ఏ.ఎస్. అధికారి శౌర్య పటేల్, డి.ఆర్.ఓ. ఆర్.శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్.డి.ఓ.లు విశ్వేశ్వరరావు, అజయ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, చెన్నయ్య, గ్లోరియా, తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం మండల స్థాయి అధికారులతో అభివృద్ధి అంశాలపై కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలల్లో డ్రాపవుట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను పెంచాలని, ఈ విషయంపై ఎం.పి.డి.ఓలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన చెప్పారు. సర్వీసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలని ఆయన అన్నారు. సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు కచ్చితంగా వేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీ కె. శ్రీనివాసులు, ట్రైనీ ఐ.ఏ.ఎస్. అధికారి శౌర్య పటేల్, సి.పి.ఓ. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పి.డి. పేరయ్య, ఐ.సి.డి.ఎస్. పి.డి. ధనలక్ష్మి, జి.ఎస్. డబ్ల్యు.ఎస్. అధికారి ఉషారాణి పాల్గొన్నారు.

అమెరికాలో ఎన్టీఆర్‌కు నివాళులు

విశాలాంధ్ర-పామూరు : తెలుగు చలన చిత్ర కథానాయకులు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు అమెరికా దేశంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలుగువాడికి దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడ గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్‌కు ప్రవాస ఆంధ్రుల ఆధ్వర్యంలో అమెరికాలోని చార్లెస్ నగరంలో మంగళవారం జరిగిన ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో పామూరుకి దేవరపు మాల్యాద్రి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సజ్జలను కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కావలి నియోజకవర్గం పరిశీలకులు కదిరి బాబురావు మర్యాద పూర్వకంగా కలిశారు. కావలి నియోజకవర్గం పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాలు అమలు తీరు, గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరిగిన విధానం గురించి చర్చించారు. అలాగే కనిగిరి నియోజకవర్గంలోని పరిస్థితులపై కూడా చర్చించారు.

జబర్దస్త్ హైపర్ ఆది జన్మదినోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జబర్దస్త్ ద్వారా సినీ ఇండస్ట్రీకి పరిచయమైన కమీడియన్ హైపర్ ఆది జన్మదిన వేడుకను హైపర్ ఆది ఫాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఒంగోలు రిమ్స్ ఆవరణలో కేకును కటింగ్ చేసి స్వీట్స్ పంచిపెట్టారు. రిమ్స్ ఆస్పత్రిలోని 500 మందికి మరియు నగరంలో అనాధలకు 500 మందికి మొత్తం వెయ్యి మంది పేదలకు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఆర్ఎస్ ఈవెంట్స్ ఆర్గనైజర్ రామ్ సాయి ఆర్థిక సహాయంతో శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివం పౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీ హరి, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, నూక తోటి శరత్ బాబు. కోసూరి శ్రీదేవి, కొమ్మిరమణయ్య, మల్లవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మృతి బాధాకరం

విశాలాంధ్ర-చీమకుర్తి : పట్టణంలోని రాంనగర్ 4వ లైను నందు నివాసం ఉంటున్న వై ఎస్ ఆర్ పార్టీ కార్యకర్త మర్రిపూడి పోలేశ్వరరావు కుమారుడు వెంకటేశ్వర్లు ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఒంగోలులోని యూనియన్ బ్యాంకు నందు విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం బ్యాంకులో డ్యూటీ లో ఉండగా గన్ మిస్ ఫైర్ అవడంతో అక్కడికక్కడే చనిపోయారు. మంగళవారం అతని పార్థివ దేహానికి ఏఎంసి మాజీ చైర్మన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ మంచివాడిగా పేరుతెచ్చుకున్న వెంకటేశ్వర్లు ఆకస్మికంగా మరణించడం చాలా భాధాకరం అని అన్నారు, కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు.

ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీ పల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు రెడ్డిని ఎంపీపీ అత్యాల జెఫన్యా వైస్ ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీవోను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పిసి పల్లి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని అయ్యన్నకోటలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు వైసిపి మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి స్థానిక ప్రజలు తో కలిసి మంగళవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో గట్ల విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రమ్మ అకాలమరణం బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఉత్తర అమెరికా ఆప్టా వ్యవస్థాపకులు చందు శ్రీనివాస్ మాతృమూర్తి చంద్రమ్మ అకాల మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపి నాయకులు కదిరి బాబురావు అన్నారు. మంగళవారం చంద్రమ్మ గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న కదిరి బాబురావు బాపట్ల జిల్లా వేమూరు మండలంలోని కాకర్లముడి గ్రామంలో ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుమారుడు చందు శ్రీనివాస్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చంద్రమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంభానికి మనోధైర్యాన్ని కల్పించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి మున్సిపల్ చైర్మన్ స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి పట్టణంలో ప్లాస్టిక్ కవర్లపై పూర్తిస్థాయి నిషేధానికి అన్ని రకాల వ్యాపార దుకాణదారులు సహకరించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్ అన్నారు. కందుకూరు రోడ్డు, ఆర్టీసీ డిపో పరిసర ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం మున్సిపల్ మరియు సచివాలయ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు దుకాణాలు, హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించి, ప్లాస్టిక్ కవర్లను గుర్తించి వాటిని వినియోగిస్తున్న వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధం పై ఎన్నిసార్లు అవగాహన కల్పిస్తున్నా వ్యాపారుల్లో మార్పు రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్లాస్టిక్ కవర్లు వాడడానికి వీలులేదని, ప్రస్తుతం హెచ్చరించి వదిలి వేస్తున్నామని, రేపటినుండి ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గుడ్డ మరియు పేపర్ కవర్లను వ్యాపారులు వినియోగించాలని అవగాహన కల్పించారు. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి హాని కలగడంతో పాటు భవిష్యత్తులో మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని మున్సిపల్ చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవరాజ్, శ్రీరామ్ సతీష్, మండల విద్యా శాఖాధికారులు ప్రసాద రావు, దాస్ ప్రసాద్,సానిటరీ కార్యదర్శి స్రవంతి, వైసీపీ నాయకులు బొట్టు శ్రీను, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన డీలర్లు రైతులను మోసం చేస్తే లైసెన్స్ రద్దు

దుకాణాల తనిఖీలో ఏవో

విశాలాంధ్ర-తాళ్లూరు : విత్తనాలను అమ్మే దుకాణం డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అందించి మోసం చేసినట్లయితే వారి లైసెన్స్ రద్దు చేయబడుతుందని మండల వ్యవసాయాధికారి బి ప్రసాదరావు అన్నారు. మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో గల విత్తనాలను అమ్మే దుకాణాలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలు స్టాకు చేసే గోడౌన్లను, విత్తనాలను పరిశీలించి ఆయన మాట్లాడుతూ రైతులకు దుకాణదారులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను, అనుమతి పొందిన కంపెనీలను ధ్రువీకరించుకొని వాటిని మాత్రమే రైతులకు అమ్మాలని ఆయన తెలిపారు. విత్తనాలు అమ్మే సమయంలో డీలర్లు రైతుల చేత సంతకాలు పెట్టించి రసీదులో దానిని ధృవీకరించవలసి ఉంటుందని ఆయన తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై తొలకరి జల్లులు పడే అవకాశం ఉన్నందున రైతులు సాగుకు సన్నద్ధం కావాలని ఆయన తెలిపారు. విత్తనాలను అమ్మే సమయంలో డీలర్లు ల్యాబ్ లో వివరించిన అంశాలను గమనించి, టెస్టింగ్ చేసిన తర్వాత మాత్రమే మొలకలు అధిక శాతం ఉన్న విత్తనాలను మాత్రమే అమ్మాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుమ, విత్తన దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి టీచర్ కుటుంబానికి న్యాయం చేయాలి

విశాలాంధ్ర-చీమకుర్తి : టంగుటూరు మండలం రాయవారిపాలెం గ్రామంలో అంగన్వాడి వర్కర్‌ని ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వ్యక్తిని అరెస్టు చేయాలని, చనిపోయిన అంగన్వాడి వర్కర్ కుటుంబానికి 25 లక్షల ఎక్స్ గ్రేషియో ప్రభుత్వం ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చీమకుర్తి తాహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. టంగుటూరు మండలం రాయవారిపాలెం గ్రామంలో అంగన్వాడి వర్కర్‌గా పనిచేస్తున్న సవలం హనుమాయమ్మను అదే గ్రామానికి చెందిన సవలం కొండలరావు హనుమాయమ్మను ట్రాక్టర్ తో ఢీ కొట్టి చంపడం జరిగిందని ఆమెకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, ఆ కుటుంబానికి ఆమె ఆధారమని హనుమాయమ్మను చంపిన కొండలు రావుని అరెస్టు చేయాలని, చనిపోయిన అంగన్వాడీ వర్కర్ కుటుంబానికి ప్రభుత్వం 25 లక్షలు ఇచ్చి కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కే. శారద, పి.నాగరత్నం, వీరమ్మ,డి సుభాషిని నాగలక్ష్మి,వెంకట్ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలి

విశాలాంధ్ర -ఒంగోలు : పార్టీని ప్రజలలోకి విస్తరితంగా తీసుకోవాలని బిజెపి ఓంగోల్ నియోజకవర్గం పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 9సంవత్సరాల సేవా. సుపరిపాలన. పేదల సంక్షేమంలో భాగంగా బిజెపి తలపెట్టిన నెల రోజుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని సీనియర్ నాయకులు. కార్యకర్తల సమావేశం బిజెపి ఒంగోలు అసెంబ్లీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి యోగయ్య యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ కార్యకర్తలతో సమావేశం కావటం నాకు చాలా సంతోషంగా ఉన్నదని.ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గానీ పట్టిన జెండా దించకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాడే కార్యకర్తలు ఒక్క బిజెపి లో మాత్రమే ఉన్నారని. ఈ రాష్ట్రంలో ఒక అరాచక పరిపాలన నడుస్తున్నది అని,నిన్న కొండేపి లో అక్కడవున్న ఎమ్మెల్యే చాలా సౌమ్యుడు అని ఆయనను గృహ నిర్బంధం చేయటందుర్మార్గమని, రావివారి పాలెంలో హనుమాయమ్మ అనే దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించటం హేయమైన చర్య అని మనము ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక ఆటవిక పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. తక్షణమే కేంద్రము జోక్యం చేసుకొనాలని ఆయన డిమాండ్ చేశారు. కొండిపి ఎమ్మెల్యే స్వామిపైన వైఎస్సార్సీపీ గూండాల దాడిని బిజెపి ఖండిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమములో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కృష్ణారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు అన్ని ఒకేసారి పెట్టండి కన్వీనర్ సేగ్గం శ్రీనివాసరావు. జిల్లా ప్రధాన కార్యదర్శి యాదవ్. మైనారిటీ మోర్చా అధ్యక్షులు కరీం తదితరులు పాల్గొన్నారు.

మామిడి పండ్లపై రసాయినాలు వాడారా ఇక జైలుకే

ఉద్యాన శాఖ అధికారి దుత్తా శ్వేత

విశాలాంధ్ర-కంభం : మామిడికాయలను సరైన దశలో కోసి సురక్షిత పద్ధతిలో మాగ పెట్టినట్లు అయితేనే అది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. చాలామంది వ్యాపారస్తులు రైతులు కాయలు పచ్చిగా ఉన్నప్పుడే ధర కోసం కాయలను తీసుకొని మార్కెట్‌కు పంపించడం జరుగుతుంది. కృత్రిమంగా పండ్లను మాగ బెట్టుటకు కొంతమంది రైతులు మరియు వర్తకులు కాల్షియం కార్బైడ్‌ను వాడుచున్నారు, దీనిని ఉపయోగించి పండించిన పండ్లను తిన్నవారికి క్యాన్సర్, అల్సర్ మరియు కాలేయం సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడే ఏసిటిలిన్ వాయువు నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపుట వలన తలనొప్పి, జ్ఞాపక శక్తి తగ్గడం జరుగుతుంది. ప్రి వెన్షన్ ఆఫ్ ఫ్రుడ్ అడల్ట్రేషన్ రూల్స్1955 యొక్క రూల్ నెంబర్ 44 ప్రకారం కాల్షియం కార్బైడ్ ఉపయోగించి పండ్లను మాగ బెట్టు వారికి 3 సంవత్సరములు జైలు శిక్షతో పాటు రూ.1000-00 రూపాయలు జరిమానా విధించబడును.

ప్రత్యామ్నాయ మార్గాలు

రెపనింగ్ ఛాంబర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన రెపనింగ్ చాంబార్ లలో ఏథిలిన్ వాయువు వినియోగించి పండు బారించడం. ఏత్రల్ 0.5 మీ.లీటర్లు- లీటరుకు నీటికి చొప్పున కలిపి తయారుచేసిన ద్రావణంలో మామిడికాయలు ముంచి తీసిన తరువాత ఆరబెట్టినట్లు అయితే మామిడికాయలు మూడు రోజులలో పండుగా మారుతాయి. పై రెండు పద్ధతులలో వ్యాపారస్తులు మామిడికాయలను పండగ మాగబెట్టి అమ్ముకున్నట్లయితే వినియోగదారులకు నాణ్యమైన మామిడి పండ్లు లభిస్తాయి.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కె.పి నాగార్జునరెడ్డి మంగళవారం సాయంత్రం పట్టణంలోని 13వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మార్కాపురం డివిజన్ పట్ల వైసిపి పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అన్నారు. అందులో భాగంగానే మార్కాపురం ప్రాంతంలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే మంత్రంగా రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు జరిగిన విధంగా ఏపీలో వినూత్నమైన కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తద్వారా అన్ని వర్గాల ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నవరత్నాల కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు వివిధ పథకాలు అందుతున్నాయని అన్నారు. దీంతో వారి జీవన ప్రమాణాల్లో గతంలో కన్నా ఎంతో వ్యత్యాసం కనిపిస్తుందని అన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. ముఖ్యంగా అట్టడుగు వర్గాలైన ఎస్సీ బీసీ మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైసీపీ పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కెపి, ఛైర్మన్ చిర్లంచర్ల,వైస్ చైర్మన్ లు ఇస్మాయిల్, సీహెచ్ అంజమ్మ లకు ప్రజలు పూల మాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు.

నేత్రపర్వంగా నారసింహుని కళ్యాణం

కనులారా వీక్షించి తరించిన భక్తులు
వేలాది మంది భక్తుల మధ్య ఘనంగా రథోత్సవం

విశాలాంధ్ర-సింగరాయకొండ : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాత సింగరాయకొండ శ్రీశ్రీశ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నాడు నేత్రపర్వంగా స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ ఘట్టాన్ని తిలకించడానికి దేశ నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవ దేవుని ఆశీస్సులు పొందుతారు. స్వామి వారి కళ్యాణం భక్తులు వీక్షించి పులకరించిపోతారు. భక్తుల కొంగు బంగారమైన ఈ ఆలయంలో ప్రధాన ఘట్టమైన స్వామి వారి కళ్యాణం కొరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఆలయ ప్రధానార్చకులు ఉదయగిరి నరసింహచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చా రణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఒ క్రిష్ణవేణి, ధర్మకర్తల మండలి చైర్మన్ పామర్తి మాధవరావు పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేసారు.

ఘనంగా రథోత్సవం : శ్రీశ్రీశ్రీ వరాహలక్ష్మీ నరసింహుని కళ్యాణం అనంతరం సాయంత్రం స్వామి వారి రథోత్సవం కోసం వేలాది మంది భక్తులు ఎదురు చూస్తుంటారు. స్వామి వారు రథంపై అశీనులైన తదుపరి భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగుతూ గ్రామ పురవీధుల్లో స్వామి వారిని ఊరేగిస్తారు. గ్రామంలో నారసింహ స్మరణతో మారుమోగి పోయింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. లక్ష్మీనరసి ంహస్వామి బ్రహ్మోత్సవాల్లో కొండేపి నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగి లాగిప్రారంభించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

రైలుప్రమాదంపై నరసం ప్రగాఢ సంతాపం

విశాలాంధ్ర-ఒంగోలు : ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ సమీపంలోని బహనాగ వద్ద జరిగిన కోర మాండల్ ఎక్స్ప్రెస్ రైలు దుర్ఘటనలో వందలాది మంది మృత్యువాత పడటం పట్ల నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర గౌరవాధ్య క్షురాలు తేళ్ళ అరుణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో తేళ్ళ అరుణ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. దేశమే ఉలిక్కిపడి దిగ్భ్రాంతికి లోనైన కనీవినీ ఎరుగని ఈ సంఘటన పైసిబిఐ విచారణ అనంతరం ఇది మానవ తప్పిదమైతే మాత్రం దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మృతుల ఆత్మశాంతికై కొవ్వొత్తులను వెలిగించి వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి సింహాద్రి జ్యోతిర్మయి, కళామిత్రమండలి అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కృష్ణదేవరాయాంధ్ర సాహితీ సమాఖ్య అధ్యక్షుడు శ్రీ కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జున రావు, యు.వి.రత్నం, ఓరుగంటి ప్రసాద్, ధర్నాశి చిరంజీవి, ప్రముఖ ప్రజా గాయకులు నూకతోటి శరత్ బాబు నాళం నరసమ్మ,మారేపల్లి సూర్యకుమారి, బీరం అరుణ, కె.శాంతిలత, సి.హెచ్.కనకదుర్గ, గుంటుపల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయాలతోనే ప్లాస్టిక్ నియంత్రణ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, తదితర వస్తువుల నియంత్రణ నిర్మూలన జరగాలంటే వాటికి ప్రత్యామ్నాయాల వైపు ప్రభుత్వం, ప్రజలు వడి, వడిగా అడుగులు వేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రా చారి అభిప్రాయపడ్డారు. మంగళ వారం పర్యావరణ దినోత్సవ రెండవ రోజు సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్లాస్టిక్ నియంత్రణ కోసం చట్టాలైతే చేస్తున్నారు కానీ, ఆచరణలో వైఫల్యం జరుగుతుందన్నారు. మొక్కుబడిగా చేస్తున్న దాడులతో ఒరిగేది లేదన్నారు. నిరాటంకంగా ప్లాస్టిక్ కవర్లు,ఇతర విక్రయాలు జోరుగా సాగుతున్నా యనీ,ప్రత్యామ్నాయాలు లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పేపర్,గుడ్డ,జూట్ సంచుల తయారీ, చౌక ధరలకు పంపిణీ జరగాలన్నారు. చెత్త సేకరణలో ప్రభుత్వం ప్రజలకు ఇంటింటికీ రంగుల బుట్టలు అందించినట్టుగా పర్యావరణ హిత సంచులను కూడా ఇంటింటికీ అందించడం ద్వారా ప్రజలు అలవాటు పడి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణ జరుగుతుందన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం చేసినప్పటికీ, పాలకులు, అధికారుల స్వార్థంతో ఆశయం నీరు కారిపోతుందన్నారు. దీనికై ప్రజలే అప్రమత్తమై తమకు తాముగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని విరమించుకోవాలని కోరారు. ఒంగోలు నగరంలో రోజుకు 5 లక్షలకు పైగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వినియోగం,ఇతర ప్రాంతాలకు 15 లక్షలకు పైగా ఇతర ప్రాంతాలకు అమ్మకాలు జరుగుతున్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ సంస్థ సభ్యులు దార్ల శ్రీనివాసరావు, పైనమ్ మధు, ఎఎల్ ప్రసాద్, లక్ష్మీనారాయణ, ప్రసాద్ మనోహర్ పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రామారావు, మోహన్, భార్గవి, మోజేస్, ప్రభాకర్, స్వాతి, అనూరాధ పాల్గొన్నారు.